క్లుప్తంగా

బక్రీద్‌కు సర్వం సిద్ధం

• నేడు ఈదుల్ అజ్హా ప్రత్యేక నమాజ్‌లు



పడుగుపాడులో ఈద్గా వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

కోవూరు : పవిత్ర బక్రీద్ (ఈదుల్ అజ్హా)ను ముస్లింలు త్యాగానికి ప్రతీకగా జరుపుకుంటారు. ముస్లింలకు ఏడాదిలో రెండు ప్రధాన పండగలు ఉన్నాయి. ఇందులో ఒకటి రంజాన్ కాగా మరొకటి బక్రీద్. ఈనెల 17న బక్రీద్ పండగను కోవూరు నియోజకవర్గంలోని పలు ఈద్గాల్లో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ఇందులో భాగంగా సంబంధిత అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శనివారం తన చాంబర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రార్థనల కోసం ఈద్గాలను శుభ్రంగా ఉంచి తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

రక్తదాతలకు సన్మానం



నెల్లూరు(బృందావనం) : బాలాజీనగర్‌లోని లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రతిభ కార్యాలయంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనేక సార్లు రక్తదానం చేసిన సతీష్‌కుమార్, రూపేష్, రమాదేవిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ ఫౌండర్ రామ్మోహన్‌రావు, మాజీ అధ్యక్షుడు రాజాచంద్ర, శ్రీధర్, లక్ష్మీనారాయణ, సుభాషిణి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

117 జీఓను రద్దు చేయాలి



మంత్రి ఆనంతో బీటీఏ నాయకులు

నెల్లూరు (టౌన్) : ప్రభుత్వ విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు 117 జీఓను రద్దు చేయాలని బీటీఏ నాయకులు కోరారు. బీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి మాస ప్రసాద్ ఆధ్వర్యంలో దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలను వారి నివాసంలో ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్, అసోసియేట్ ప్రెసిడెంట్ వేణుగోపాల్, ఆర్థిక కార్యదర్శి ఆదినారాయణ, జిల్లా నాయకులు మాల్యాద్రి, మనోజ్‌కుమార్, రఘురాం, కృష్ణయ్య, ఖాజారహంతుల్లా, మల్లికార్జున, శ్రీనివాసులు, రవి, ఎరుకులయ్య, పెంచలప్రసాద్, కరుణాకర్, హరి, చక్రపాణి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య పెద్దలకు వ్యాధులపై అవగాహన



డాక్టర్ జానకీరామమ్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

నెల్లూరు(బృందావనం) : నగరంలోని ఆచారి వీధిలో ఉన్న నెల్లూరు క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్లో ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ నూకల జానకీరామమ్ హాజరయ్యారు. పెద్దలకు కాలేయం, గ్యాస్, కడుపునొప్పి తదితర విషయాలపై అవగాహన కలిగించారు. ఆయా వ్యాధుల గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీధర్‌రావు మాట్లాడుతూ నగర పరిధిలోని ఆర్యవైశ్య పెద్దలకు వివిధ కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు పలు వ్యాధులకు, వాణిజ్య పరంగా అవగాహన కలిగేలా నిపుణులతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏప్రిల్, మే, జూన్ నెలలో పుట్టినరోజు జరుపుకున్న అసోసియేషన్ సభ్యులను సత్కరించామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి చుండూరు కృష్ణమూర్తి, కోశాధికారి అద్దేపల్లి సుబ్బారావు, ఆడిటర్ డి.సుధాకర్‌రావు, సంతోష్‌కుమార్, కె.ప్రవీణ్‌శంకర్ మరో 60 మంది సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ జానకీరామమ్‌ను సన్మానించారు.

శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయం

• 20 ఏళ్లుగా ఇదే దుస్థితి
• ఇరిగేషన్ అతిథి గృహంలోకి మార్పు
• కొత్త భవనానికి మోక్షమెన్నడో ?



శిథిలావస్థకు చేరడంతో ఖాళీగా వదిలేసిన తహసీల్దార్ కార్యాలయం

కొడవలూరు : మండలంలో ఎంతో కీలకమైన తహసీల్దార్ కార్యాలయానికి భవన సదుపాయం కరువైంది. 1988లో ఈ కార్యాలయ భవనాన్ని నిర్మించగా నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో 15 ఏళ్లకే శిథిలావస్థకు చేరింది. 2005లో తాత్కాలిక మరమ్మతులు చేపట్టి వినియోగిస్తూ వచ్చారు. కానీ ఫలితం లేకుండా పోయింది. శ్లాబు పెచ్చులూడుతూ సిబ్బందికి ప్రాణసంకటంగా మారింది. ఈ నేపథ్యంలో ఉద్యోగుల ప్రాణాలకే ముప్పని భావించి రెండేళ్ల క్రితం బ్రిటీష్ కాలంలో నిర్మించిన ఇరిగేషన్ అతిథి గృహానికి మార్చారు. ఈ భవనం పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉంది.

నాణ్యతా లోపం

మండల వ్యవస్థ ఏర్పడ్డాక రెవెన్యూ కార్యాలయానికి ఉన్న ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకుని 1988లో తహసీల్దార్ కార్యాలయాన్ని నిర్మించారు. అయితే పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో 15 ఏళ్లకే భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో 2005లో మరమ్మతులు చేపట్టారు. ఈ మరమ్మతుల్లోనూ నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో మరో పదేళ్లకు అంటే 2015 సంవత్సరానికే పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. అప్పటి నుంచి నూతన భవనానికి ప్రతిపాదనలు పంపుతూ వచ్చారు. కానీ నిధుల లేమి వెంటాడుతోంది. దీంతో భవనం మరింత శిథిలావస్థకు చేరి శ్లాబు పెచ్చులూడుతూ ఉద్యోగులను భయభ్రాంతులకు గురి చేయడం ఆరంభమైంది. తహసీల్దార్ గదితో సహా అన్ని గదుల్లో ఇదే పరిస్థితి నెలకొంది. తహసీల్దార్ గదిలో ఒకసారి పెద్ద ఎత్తున పెచ్చులూడి పడడంతో తహసీల్దార్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. ఈ నేపథ్యంలోనే కావలి ఆర్డీఓగా ఉన్న శీనానాయక్ రెండేళ్ల క్రితం కార్యాలయ సందర్శనార్థం వచ్చారు. భవనం దుస్థితిని స్వయంగా చూసి వెంటనే కార్యాలయాన్ని మార్చాలని ఆదేశించారు. ప్రత్యామ్నాయం లేదని అధికారులు తెలపడంతో స్థానికంగా ఉన్న ఇరిగేషన్ అతిథి గృహంలోకి వెంటనే మార్చాలని ఆదేశించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి అందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. దీంతో రెండేళ్ల క్రితం కార్యాలయాన్ని ఇరిగేషన్ అతిథి గృహానికి మార్చారు.

అంతంత మాత్రంగానే ఇరిగేషన్ అతిథి గృహం

ఇక్కడి ఇరిగేషన్ అతిథి గృహాన్ని బ్రిటీష్ కాలంలో అంటే 90 ఏళ్ల క్రితం నిర్మించారు. ఈ భవనం కూడా శిథిలావస్థకు చేరడంతో దీనిని నిరుపయోగంగా వదిలేశారు. దీంతో ఈ భవనం పాములకు ఆవాసంగా మారింది. ప్రమాదకరమైన తహసీల్దార్ కార్యాలయ భవనం కంటే ఇది కొంత మెరుగని భావించి మార్పు చేయాలని ఆర్డీఓ ఆదేశించారు. ఈ భవనం శిథిలావస్థలో ఉన్నప్పటికీ పైపైనే రంగులు వేసి మార్పు చేశారు. ఈ భవనం పైకప్పు పెంకులతో వేసింది కావడంతో ప్రాణాపాయం కాదని అధికారులు భావించారు. కానీ పెంకులకు ఆధారంగా వేసిన కొయ్యలు విరిగి పడుతుండడంతో పాటు కార్యాలయంలోకి విషసర్పాలు యథేచ్ఛగా వచ్చేస్తున్నాయి. దీంతో కార్యాలయ సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రతిపాదనలతో సరి

మండలానికి తహసీల్దార్‌గా వచ్చిన ప్రతి అధికారి కార్యాలయ దుస్థితిని దృష్టిలో పెట్టుకుని నూతన భవనానికి ప్రతిపాదనలు పంపుతున్నారు. ఇప్పటి వరకు ఐదుగురు తహసీల్దార్‌లు ప్రతిపాదనలు పంపారు. కానీ నిధుల మంజూరుకు నోచుకోలేదు. 2017లో ఎన్‌ఆర్‌ఐడీఎఫ్(జాతీయ గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి నిధి) కింద ప్రతిపాదనలు పంపితే కార్యాలయ నూతన భవనానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. ఆ విధంగానే ప్రతిపాదనలు పంపినప్పటికీ నిధులు మంజూరు కాలేదు. దీంతో నూతన భవన నిర్మాణం కలగానే మిగిలింది. నిత్యం పదుల సంఖ్యలో రైతులు ఈ కార్యాలయానికి వస్తుంటారు. కానీ ఇక్కడ అసౌకర్యంగా ఉండడంతో పాటు ప్రమాదకరంగా ఉంది. దీనికున్న ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకుని జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయ నూతన భవన నిర్మాణాన్ని చేపట్టాల్సి ఉంది.



శిథిలావస్థలో ఉన్న తాత్కాలిక తహసీల్దార్ భవనం

మనుబోలమ్మకు ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న మనుబోలమ్మ

మనుబోలు : మనుబోలు పెద్ద చెరువు గట్టున వెలసిన గ్రామదేవత మనుబోలమ్మ ఆలయంలో ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఏడాది బాగా వర్షాలు కురిసి పాడి పంటలతో గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ ప్రజలు పూజలు చేశారు. అర్చకుడు ఫణీంద్రశర్మ గ్రామ దేవతలైన మనుబోలమ్మ, నాగార్పమ్మలకు అభిషేకాలు జరిపించి ప్రత్యేకాలంకరణ చేశారు. పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



కొడవలూరు : 30 ఏళ్ల క్రితం పదో తరగతి చదువుకున్న వారంతా ఒక వేదికపైకి చేరారు. అలనాటి ఆనందాలను గుర్తుచేసుకున్నారు. దీంతో వారి ఆనందానికి అవధుల్లేకుండాపోయాయి. మండలంలోని గండవరం ఉన్నత పాఠశాలలో 1993–94 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో సమావేశమయ్యారు. వివిధ ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడిన వారంతా సమావేశానికి హాజరయ్యారు. ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ గత స్మృతులను నెమరేసుకుంటూ మూడు గంటల పాటు ఎంతో ఆనందంగా గడిపారు. తరగతి గదిలో కొందరు విద్యార్థులు చేసిన చిలిపి చేష్టలను గుర్తుచేసుకుని ఆనందించారు. ఎవరు ఎలా స్థిరపడ్డారు.. ఎలాంటి ఒడిదుడుకులను ఎదుర్కొన్నారు.. తదితర విషయాలను పంచుకున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు వారంతా ఆనందంగా గడిపారు. అనంతరం అందరూ కలిసి సామూహిక భోజనం చేశారు. ప్రతి ఏడాది ఇదేలా విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలలో కలిసి ఆనందంగా గడుపుదామని ముక్తకంఠంతో స్పష్టం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు జంజ్యం సుధీర్, ఇనమాల శ్రీహరి, గుర్రాల కోటయ్య, షేక్ సాధిక్, జె.శ్రీరాములు, ఒంటేరు ప్రేమ్‌కుమార్, ఆరుద్ర మహేష్, అద్దూరు శీనమ్మ, నాగిరెడ్డి స్వరూప, షాహినా, పి.శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయుని బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



సముద్రపు నీటిని తెస్తున్న చిన్నారులు, యువకులు, పెద్దలు

కొడవలూరు : కొడవలూరులో వెలసిన ప్రసన్నాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలకు ఆదివారం అంకురార్పణ జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలోని చిన్నారులు, యువకులు, పెద్దలు ఊటుకూరు పెద్దపాళెం సముద్ర తీరానికి వెళ్లి స్నానమాచరించి సముద్రపు నీటిని తీసుకొచ్చారు. సాయంత్రం స్వామివారికి అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారి పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కోవూరు వెంకీ, పి.రాధాకృష్ణ, కాకాని మురళి, మల్లెల అనిల్, గాలి ప్రసాద్, చింతాటి రవి, ఉయ్యాల నారాయణ, అరగల సుధీర్‌బాబు, ముడి హరికృష్ణ, దుంపల కిరణ్ పాల్గొన్నారు.

పోటెత్తిన కోడూరు తీరం



సముద్ర స్నానాలు చేస్తున్న సందర్శకులు

తోటపల్లిగూడూరు : మండలంలోని కోడూరు బీచ్ ఆదివారం సందర్శకులతో పోటెత్తింది. సాధారణంగా సెలవు, పండుగ దినాల్లో సరదాగా గడిపేందుకు జిల్లా నలువైపుల నుంచి కోడూరు బీచ్‌కు సందర్శకులు విచ్చేస్తుంటారు. ఈ క్రమంలో గత కొన్ని రోజులుగా మండుతున్న ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు జిల్లా నలువైపుల నుంచి ప్రజలు కుటుంబ సమేతంగా కోడూరు బీచ్‌కు పోటెత్తి వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు తరలిరావడంతో బీచ్ కళకళలాడింది.

ఆంగ్ల పరిజ్ఞానంపై విద్యార్థులకు తరగతులు



ఆంగ్లాన్ని బోధిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

ముత్తుకూరు : గ్రామీణ విద్యార్థుల్లో ఆంగ్ల భాషా పరిజ్ఞానం పెంచేందుకు అదాని ఫౌండేషన్ నడుం బిగించింది. పోర్టు సీఈఓ జీజే రావు సూచనల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించేందుకు ప్రత్యేక తరగతులను ప్రారంభించింది. కృష్ణపట్నం జెడ్పీ హైస్కూల్‌లో కార్యక్రమం ప్రారంభించినట్లు ఫౌండేషన్ ప్రతినిధి ఆదివారం తెలిపారు. ఇందులో భాగంగా ఆంగ్ల వ్యాకరణం బోధిస్తూ ఆంగ్ల వార్తా పత్రికలు ఎలా చదవాలి, ఎలా ఉచ్చరించాలన్న అంశంపై ఫౌండేషన్ ఆంగ్ల ఉపాధ్యాయిని రాధిక ప్రత్యేక తరగతులు చేపట్టారు. అంతేకాకుండా ఆంగ్ల పత్రికలు కూడా పంపిణీ చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : మోటార్ బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని గొలగముడి క్రాస్‌రోడ్డు వద్ద ఆదివారం జరిగింది. నెల్లూరు నగరంలోని మూలాపేట ప్రాంతానికి చెందిన నవీన్‌కుమార్ పనినిమిత్తం బైక్‌పై గూడూరుకు వెళ్తుండగా గొలగముడి క్రాస్‌రోడ్డు వద్ద టిప్పర్ అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నవీన్‌కుమార్‌కు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చాముండేశ్వరీదేవికి సింహవాహన సేవ



సింహవాహనంపై ఊరేగుతున్న చాముండేశ్వరీదేవి

ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నంలో కొలువైన చాముండేశ్వరీదేవి అమ్మవారికి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సింహవాహనోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అమ్మవారు ప్రత్యేక పుష్పాలంకరణలో మేళతాళాల నడుమ గ్రామ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. గ్రామస్తులు వాకిళ్లలో ముగ్గులు వేసి అమ్మవారికి స్వాగతం పలికారు. ఈ ఉత్సవానికి ఉభయకర్తలుగా స్థానికులు కొండూరు సూరారెడ్డి, పద్మావతి దంపతులు వ్యవహరించారు. ఉదయం చప్పర ఉత్సవం జరిగింది. ఈ వేడుకను చూసి భక్తులు తన్మయం చెందారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి పులి వాహనోత్సవం జరుగనుంది.

వైఎస్సార్ విగ్రహ ధ్వంసం హేయమైన చర్య



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులు చేయడం బాధాకరమని బుచ్చిరెడ్డిపాళెం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం పట్టణ నడిబొడ్డున ఉన్న దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహ ధ్వంసం చేయడానికి దుండగులు ప్రయత్నించడం హేయమైన చర్య అని అన్నారు. ఇలాంటి వాటిని టీడీపీ ప్రోత్సహించడం సరికాదన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రశాంత వాతావరణం ఉందని, ప్రస్తుతం టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులు చేయడమే లక్ష్యంగా ఉన్నారన్నారు. వైఎస్సార్ విగ్రహం ధ్వంసం విషయమై కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి తక్షణమే స్పందించి ఘటనకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, రూరల్ కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి, నాయకులు పెద్ద అల్లాభక్షు, చిన్న అల్లాభక్షు, శివకుమార్‌రెడ్డి, విజయ్‌భాస్కర్‌రెడ్డి, యానాదిరెడ్డి, మల్లారెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చుక్కలు చూపిస్తున్న కూరగాయలు

• ఆకాశాన్నంటిన ధరలు
• వర్షాలు కురుస్తున్నా తగ్గని రేట్లు



కూరగాయలు

పొదలకూరు : గత కొద్దిరోజులుగా కూరగాయల ధరలు పగలే చుక్కలు చూపిస్తున్నాయి. జిల్లా మార్కెట్లో ఒక ధర ఉంటే మండల కేంద్రాల్లో అదనంగా పలుకున్నాయి. పచ్చి సరుకు నిల్వ ఉంటే నష్టం వాటిల్లుతుందని, 30 శాతం కూరగాయలు పాడవుతున్నందున మండల కేంద్రాల్లో అధిక ధరలకు విక్రయిస్తేనే గిట్టుబాటు అవుతుందని వ్యాపారులు చెబుతున్నారు. సాధారణంగా వేసవి కాలంలో కూరగాయల ధరలు పెరుగుతుంటాయి. నీటి లభ్యత సక్రమంగా లేక వేసవి తాపానికి కూరగాయల మొక్కలు వాడిపోయి డిమాండ్ మేరకు దిగుబడి ఉండదు. అయితే వర్షాలు కురుస్తున్నా ప్రస్తుతం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. దీనికి తోడు ఉల్లిపాయల ధరలు కూడా పెరగడంతో గృహిణులు లబోదిబోమంటున్నారు. కూరగాయల్లో రారాజైన టమోటా ఏకంగా కిలో రూ.60కు చేరుకుంది. గ్రామాలు, మండల కేంద్రాల్లో కూరగాయల ధరలు కిలో ఒక్కటింటికి రూ.60 నుంచి రూ.120 వరకు పలుకుతున్నాయి. బీన్స్, క్యారెట్, పచ్చిమిర్చి, టమోటా ధరలు చుక్కలు చూపిస్తున్నాయని వినియోగదారులు అంటున్నారు. ఆకుకూరలు కూడా సక్రమంగా లభ్యం కావడం లేదని ధరలు పెంచినట్టుగా చెబుతున్నారు. కూరగాయలతో పాటు చికెన్ ధరలు కూడా బాగా పెరిగాయి. గ్రామాల్లో బ్రాయిలర్ చికెన్ కిలో రూ.300 అమ్ముతున్నారు. మండల కేంద్రాల్లో మాత్రం కిలో రూ.280లకు విక్రయిస్తున్నారు.

పెరిగిన ఉల్లిపాయల ధరలు

ఉల్లి ఎప్పుడు పెరుగుతుందో చెప్పలేకపోతున్నారు. కిలో ఒక్కటింటికి రూ.35 నుంచి రూ.40 ఉన్న ధరలు ఒక్కసారిగా రూ.50కి చేరుకుంది. ఉల్లి లేకుండా వంట సాధ్యం కాదు. దీంతో ఎంత ధర పలుకుతున్నా కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంది. ముందు జాగ్రత్తగా ఉల్లిని కొనుగోలు చేసినా పాడవుతాయని, అందువల్ల స్వల్పంగానే కొనుగోలు చేయాల్సి ఉంటుందని మహిళలు అంటున్నారు. ఏమి కొనాలో ఏమి తినాలో అని ముఖ్యంగా మహిళలు వాపోతున్నారు.